అందరివాడు అంబేద్కర్

మొదటిపేజీ తరువాయి...

భాష, ప్రాంతం, కుల, మతాలతో వైవిధ్యమున్న దేశంలో ఐక్యతకు కృషిచేసిన మహానుభావుడు అంబేద్కర్ అని అన్నారు. ఆయన దూరదృష్టితో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు బాటలు వేశారని కీర్తించారు. ఇదే కోవలో చిన్నరాష్ట్రాల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన ఆయన, రాష్ట్రాలు ఏర్పాటయ్యే సందర్భంలో విడిపోతున్న రాష్ట్రాల గొంతు నొక్కవద్దని భావించారని తెలిపారు. విడిపోయేందుకు పూర్వపు రాష్ట్రం అనుమతి అవసరం లేదని చెప్పి ఆనాటి రాజ్యాంగ కమిటీ బాధ్యులు వద్దని వారించినా ఆర్టికల్-3ని రాజ్యాంగంలో చేర్చిన గొప్ప నాయకుడని ప్రశంసించారు.

బాబాసాహెబ్ బాటలోనే కేసీఆర్

'అంబేద్కర్ ప్రవచించిన బోధించు, సమీకరించు, పోరాడు' అనే సిద్ధాంత స్ఫూర్తితోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుకుసాగారని కేటీఆర్ పేర్కొన్నారు. 'పార్టీ పెట్టిన 2001లో సింహగర్జన సభా వేదిక నుంచే తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలందరికీ వివరించి.. వారందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి.. పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని ముద్దాడారు' అని గుర్తుచేశారు. 'అధికారంలోకి వచ్చిన తర్వాత గొప్ప మనసుతో 100కు పైగా గురుకులాలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థిపై రూ.1.20 లక్షలకు పైగా వెచ్చించి నాణ్యమైన విద్యనందించారు. అంబేద్కర్, జ్యోతిబా పూలే, వివేకానందుడి పేరిట ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి శ్రీకారం చుట్టి ఏడువేల మంది నిరుపేద బిడ్డలను విదేశాలకు పంపించిన ఘనత ఆయనకే దక్కింది' అన్నారు. అలాగే చేతిలో వనరులు లేకున్నా పిండికొద్దీ రొట్టె అన్న తరహాలో నిరుపేద దళితుల బతుకుల్లో వెలుగులు నింపే లక్ష్యంతో దళితబంధుకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. రాజకీయంగా కొంతమేర నష్టం జరుగుతుందని తెలిసినా వెనుకడుగు వేయకుండా ముందుకెళ్లిన ఖలేజా ఉన్న స్వాప్నికుడని అభివర్ణించారు. 'దళితులను ధనికులుగా మార్చాలని తెచ్చిన ఈ పథకం కింద తన నియోజకవర్గంలో విజయలక్ష్మి ఇండస్ట్రీస్ పేరిట రైస్ మిల్, కల్వకుర్తి నియోజకవర్గంలో కడ్తాల్‌లో ఓ డెయిరీ ఫాం, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఓ ముగ్గురు కలిసి బస్సు కొని అద్దెకు ఇచ్చారు. తొమ్మిది మంది కలిసి పెట్రోల్ పంప్ పెట్టుకున్నారు. కానీ కొందరు దుష్ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందితే పొందవచ్చు. కానీ నేను మాత్రం గర్వపడుతున్నా.. అంబేద్కర్ జైభీమ్ నినాదాన్ని విధానంగా మార్చుకున్న కేసీఆర్‌కు ఆయన దళంలోని సైనికుడిగా సెల్యూట్ చేస్తున్నా' అని చెప్పారు.

మహనీయుడి చలవతోనే మహిళలకు ఓటు..

అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో మహిళలు ఓటు హక్కు కోసం కోట్లాడుతున్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. మనదేశంలో అంబేద్కర్ దృఢ సంకల్పం, దూరదృష్టితో తీసుకున్న నిర్ణయంతోనే మహిళలకు ఓటు హక్కు వచ్చిందని చెప్పారు. ఆయన ఆచరించిన సిద్ధాంతాలు, విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ఉద్ఘాటించారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో శాసన మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, సీనియర్‌నేత పొన్నాల లక్ష్మయ్య

తుఫాన్ వేగంతో అధికారం!

'రేవంత్ 16 నెలల పాలనలో అన్నివర్గాలు మోసపోయాయి.. కులమతాలకతీతంగా ఈ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ రోజు మీరు బయటకెళ్లి ఎవరికి ఓటేస్తరని ఎవ్వరినైనా అడగండి.. ఆటోవాలాల నుంచి అంతరిక్షంలోకి పంపే రాకెట్లు తయారుచేసే వ్యక్తి దాకా ఒకటే మాట చెప్తున్నరు.. సీఎం రేవంత్‌రెడ్డిని జల్ది ఇంటికి పంపించాలని అంటున్నరు.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్ తుఫాను వేగంతో అధికారంలోకి వస్తుంది.. ఇందులో ఏ అనుమానమూ లేదు' అని కేటీఆర్ అన్నారు. నాడు అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఆయన రాసిన రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరగడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరిట మల్లికార్జున్ ఖర్గేతో చేవెళ్ల సభలో పచ్చి అబద్ధాలు చెప్పించారని మండిపడ్డారు. 'ఈ రోజు బాబాసాహెబ్ జయంతి రోజున సీఎం రేవంత్‌రెడ్డిని సూటిగా అడుగుతున్న.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదహారు నెలలు దాటినా అంబేద్కర్ అభయహస్తం కింద రూ. 12 లక్షలు ఎంతమందికి ఇచ్చిన్రు? కనీసం 12 రూపాయలైన ఇచ్చిన్రా? ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో ఎస్సీలకు రూ.6 లక్షలు ఇస్తానన్న హామీ ఏమైంది? కాంట్రాక్టర్లలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 10, బీసీలకు 42శాతం వాటా ఎక్కడికి పోయింది? స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా మాటేమైంది? విద్యాజ్యోతి కింద ఎంతమంది విద్యార్థులకు పారితోషిక మిచ్చిన్రు? అసైన్డ్ భూములపై ఎన్నివేల మంది దళిత, గిరిజనులకు పట్టాలిచ్చి హక్కులు కల్పించారు? మాటలు చెప్పిన మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ ఎక్కడికెళ్లిన్రు? రెండు బడ్జెట్‌లు పెట్టిన ప్రభుత్వం ఈ హామీల్లో ఒక్కటైనా నెరవేర్చిందా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. బాబాసాహెబ్ పేరు చెప్పి ఓట్లడిగిన కాంగ్రెస్ నాయకులు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నమ్మలేదని ఢిల్లీ పెద్దలతో డిక్లరేషన్లు..

అసెంబ్లీ ఎన్నికల ముందర ప్రజలు తనను నమ్మరనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి ఆ పార్టీకి చెందిన ఢిల్లీ పెద్దలను రప్పించి అనేక హామీలు ఇప్పించారని కేటీఆర్ ఆరోపించారు. 'రాహుల్‌గాంధీతో రైతు డిక్లరేషన్, ఖర్గేతో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, ప్రియాంకతో యూత్ డిక్లరేషన్, మొత్తం మ్యానిఫెస్టోను సోనియాగాంధీతో చెప్పించారు..కానీ రెండేండ్లు దగ్గర పడుతున్నా అమలు చేయకుండా ప్రజలకు మొండిచెయ్యి చూపుతున్నరు.. ఈ విషయంపై సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

> కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదహారు నెలలు దాటినా అంబేద్కర్ అభయహస్తం కింద రూ. 12 లక్షలు ఎంతమందికి ఇచ్చిన్రు? కనీసం 12 రూపాయలైన ఇచ్చిన్రా? ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో ఎస్సీలకు రూ.6 లక్షలు ఇస్తానన్న హామీ ఏమైంది? కాంట్రాక్టర్లలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 10, బీసీలకు 42శాతం వాటా ఎక్కడికి పోయింది? స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా మాటేమైంది? విద్యాజ్యోతి కింద ఎంతమంది విద్యార్థులకు సాయం చేశారు? అసైన్డ్ భూములపై ఎన్నివేల మంది దళిత, గిరిజనులకు పట్టాలిచ్చి హక్కులు కల్పించారు? మాటలు చెప్పిన మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ ఎక్కడికెళ్లిన్రు? రెండు బడ్జెట్‌లు పెట్టిన ప్రభుత్వం ఈ హామీల్లో ఒక్కటైనా నెరవేర్చిందా? -కేటీఆర్

దొంగలుంటారని తెలియకే లీకాల్ తేలేదు.

రాజ్యాంగంలో అంశాలను పొందుపరిచిన అంబేద్కర్.. మోసం చేసిన ప్రభుత్వాలను గద్దెదించడం ఎలాగో మరిచిపోయారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన మంచివారు కాబట్టే ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్సోళ్ల లాంటి దొంగలుంటరని ఊహించలేదని అభిప్రాయపడ్డారు. మోసాగాళ్లు పాలకులైతరని తెలిస్తే తప్పకుండా రీకాల్ విధానం పెట్టేవారేమోనని అభిప్రాయపడ్డారు.

> ప్రజలు కులమతాలకతీతంగా ఈ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ రోజు మీరు బయటకెళ్లి ఎవరికి ఓటేస్తరని ఎవ్వరినైనా అడగండి.. ఆటోవాలాల నుంచి అంతరిక్షంలోకి పంపే రాకెట్లు తయారుచేసే వ్యక్తి దాకా ఒకటే మాట చెప్తున్నరు.. సీఎం రేవంత్‌రెడ్డిని జల్ది ఇంటికి పంపించాలని అంటున్నరు.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్ తుఫాను వేగంతో అధికారంలోకి వస్తుంది.. ఇందులో ఏ అనుమానమూ లేదు. -కేటీఆర్

అంబేద్కర్‌కు ఘన నివాళి

అంబేద్కర్ జయంతి సభకు ముందు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించాయి. ఆ మహనీయుడి చిత్రపటంపై పూలజల్లి కేటీఆర్ అంజలి ఘటించారు. 'జోహార్ అంబేద్కర్.. నీ ఆశయ సాధనకు అంకితమవుతాం' అంటూ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ రాపోల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, నాయకులు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, కిశోర్‌గౌడ్, అలకుంట హరి, రాజీవ్‌సాగర్, గెల్లు శ్రీనివాస్, సుమిత్రా ఆనంద్, తుల ఉమ, చిరుమల్ల రాకేశ్ పాల్గొన్నారు.

స్పీకర్‌కు పరిమితులు విధించరా?

బిల్లుల ఆమోదంపై తమిళనాడు ప్రభుత్వం వేసిన కేసులో గవర్నర్ అధికారాలకు పరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం చరిత్రాత్మకమని కేటీఆర్ అభివర్ణించారు. గతంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ఆదేశాలతో తెలంగాణలోనూ గవర్నర్ ఇదే పద్ధతిలో బిల్లులను తొక్కిపెట్టారని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజలెన్నుకున్న ప్రభుత్వంతో పోల్చితే గవర్నర్ పాత్ర చిన్నదని చెప్పడం శుభపరిణామమని అన్నారు. అలాగే 'మా పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లో చేరిన్రు.. ఫిరాయింపు నిరోధక చట్టం ఆర్టికల్ 10కి ఇది పూర్తిగా విరుద్ధం. 14 నెలల కింద కోర్టులో కేసు వేసినం.. కానీ ఇంతవరకు తీర్పు రాలేదు. సత్వరమే తీర్పు వెలువరించి అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను ఆదేశించాలి' అని కోరారు.

లోకం పోకడ



అంబేద్కర్ ఆశయాలకు తూట్లు

మహనీయుడి స్ఫూర్తితో రాష్ట్రోద్యమం
ఆర్టికల్-3తోనే తెలంగాణ సిద్ధించింది
మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

హైదరాబాద్, ఏప్రిల్14 (నమస్తేతెలంగాణ): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవడంలో పాలకులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రంలోని 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహానికి నేటివరకూ కనీసం పూలమాల వేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తున్నదని మండిపడ్డారు. ఆ మహనీయుడి స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. కేసీఆర్ పోరాట పటిమ, అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్-3తోనే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని ఉద్ఘాటించారు.

మనదేశంలో పుట్టడం అదృష్టం: కొప్పుల ఈశ్వర్

అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన బీఆర్ అంబేద్కర్ మన దేశంలో పుట్టడం అదృష్టమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం ఆధారంగానే తెలంగాణ ఏర్పాటైందని, రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తితో కేసీఆర్ దళితబంధు లాంటి గొప్ప పథకాలను అమలు చేశారని తెలిపారు. అంబేద్కర్ ఆయన చూపిన మార్గంలో మనమందరం ప్రజాసేవకు అంకితమవుదామని పిలుపునిచ్చారు.

ప్రమాదంలో రాజ్యాంగం: ఆర్ఎస్పీ

కాంగ్రెస్, బీజేపీ తీరుతో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. సమన్యాయం, ప్రజాస్వామ్యం, లౌకిక, సౌభ్రాతృత్వానికి భంగం వాటిల్లుతున్నదని తెలిపారు. అంబేద్కర్ బతికి ఉండగానే ఏడిపించిన కాంగ్రెస్.. ఇప్పుడు తెలంగాణలో గంగా జమునా తెహజీబ్‌ను మంటగలుపుతున్నదని విమర్శించారు. జై భీం అంటూ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీ ఏమీ ఎరుగనట్టు చోద్యం చూస్తుండటం విడ్డూరమని పేర్కొన్నారు.

అంబేద్కర్‌తోనే సామాజిక న్యాయం: తుల ఉమ

అంబేద్కర్ దార్శనికతతో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందని కరీంనగర్ జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ తెలిపారు. మహిళలకు చట్టసభల్లో గౌరవం దక్కిందని, ఆయన చూపిన మార్గంలోనే కేసీఆర్ తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో పదేండ్ల పాలనలో అంబేద్కర్ స్ఫూర్తితోనే కేసీఆర్ విప్లవాత్మక పథకాలను అమలు చేశారని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేశారని చెప్పారు. అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం

మహా అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్బంధం ఎత్తివేత
జయంతి సందర్భంగా నివాళులర్పించిన మంత్రులు
సామాన్యులకు సైతం సందర్శనకు అనుమతి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పోరాటాలతో రేవంత్ సర్కారు దిగొచ్చింది. కేసీఆర్ హయాంలో నెలకొల్పిన 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్బంధం ఎత్తేసింది. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పలువురు ఉన్నతాధికారులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతేగాకుండా సామాన్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు సైతం నివాళులర్పించే అవకాశం కల్పించారు. కేసీఆర్ హయాంలో నిర్మించారనే కక్షతో అంబేద్కర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతకాలం నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. గడిచిన 15 నెలలుగా గేట్లకు తాళాలు వేసి అక్కడికి సందర్శకులు వెళ్లకుండా అడ్డుకున్నది. విగ్రహ ఆవరణను సైతం కనీసం శుభ్రం చేయకుండా అలక్ష్యం చేసింది.

ఫలించిన గులాబీ దళం పోరాటం

కేసీఆర్ ఏర్పాటు చేశారనే ఏకైక కారణంతో అంబేద్కర్‌ను అవమానిస్తున్న కాంగ్రెస్ సర్కారు తీరును బీఆర్ఎస్ ఎండగడుతూ వచ్చింది. జయంతి సందర్భంగానైనా సందర్శనకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతోపాటు నేతలంతా డిమాండ్ చేస్తూవచ్చారు. శాసనసభ వేదికగా ప్రభుత్వ తీరును బీఆర్ఎస్ నేతలు ఎండగట్టారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే గేట్లను బద్దలు కొట్టుకొని వెళ్లి అంబేద్కర్‌కు నివాళులర్పిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గత్యంతరం లేక ప్రభుత్వం దిగివచ్చి విగ్రహం వద్ద నిర్బంధాన్ని ఎత్తేసిందని ప్రజాసంఘాల నేతలు అభిప్రాయం వ్యక్తంచేశారు.

అవమానాల మధ్య అంబేద్కర్ జయంతి వేడుకలు

భావోద్వేగాలకు లోనైన దళితనేతలు

ములుగు, ఏప్రిల్ 14(నమస్తేతెలంగాణ) : ములుగు జిల్లాలో సోమవారం అధికారికంగా జరిగిన బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు అవమానాల మధ్య జరిపారని, కలెక్టర్‌తోపాటు జిల్లాస్థాయి అధికారులు రాకపోవడం, సభ ఏర్పాటు చేయకపోవడంపై దళిత సంఘాల నాయకులు నిరసనకు దిగారు. ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు అధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన వేడుకకు దళిత సంఘాలతోపాటు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు హాజరయ్యారు. సభా వేదికపై సరిపడా కుర్చీలు లేకపోవడం, సమావేశ మందిరం అప్పటికే నిండిపోవడంతో దళిత సంఘాలు, ఇతర నాయకులను అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో దళిత సంఘాల నాయకులు ఇరుగు పైడి, జన్ను రవి, బుర్రి సతీశ్, నక్క భిక్షపతి, కోగిల మహేశ్, కొట్టెపాక ప్రభాకర్, చంటి భద్రయ్య, మడిపెల్లి శ్యాంబాబు, ప్రజా సంఘాల నాయకుడు ముంజాల భిక్షపతిగౌడ్ మండిపడ్డారు. పదిరోజుల ముందు నుంచే కలెక్టర్‌ను కలిసి సభ ఏర్పాటు చేసి వేడుకలను నిర్వహించాలని చెప్పామని, అయినా కలెక్టర్ పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ వేడుకకు కలెక్టర్‌తోపాటు ఎస్పీ, మరో అదనపు కలెక్టర్, ఆర్డీవో, డీఎస్పీ, ఇతర శాఖల అధికారులు రాకపోవడం అంబేద్కర్‌ను అవమానించడమేనని తెలిపారు.

భారీ అంబేద్కర్‌కు సీఎం నివాళులేవి?

- మంత్రులు మాత్రమే నివాళులర్పిస్తరా
- మహనీయులను అవమానించడం ఆ పార్టీ నాయకులకు అలవాటే
- మా పోరాటాలతో మెట్టుదిగిన సర్కార్
- భారీ అంబేద్కర్ వద్ద వెలుగులు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖైరతాబాద్, ఏప్రిల్ 14: హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకమైన 125 అడుగుల భారీ విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నివాళులర్పించలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ పోరాటాలతోనే మెట్టుదిగి వచ్చిందని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం భారీ అంబేద్కర్ విగ్రహానికి అధికారికంగా నివాళులు అర్పించే కార్యక్రమాన్ని చేపట్టిందని, మంత్రి వర్గమంతా కదిలొచ్చినా, ముఖ్యమంత్రి మాత్రం రాలేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఖైరతాబాద్ బడాగణేశ్ మంటపంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో బీపీ మండల్ మనమడు సూరజ్ మండల్, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రవతి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ నగేశ్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్లు వెంకటేశ్, మన్నె కవితతో కలిసి పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అంబేద్కర్ అంటే తరతరాల ఉద్యమం గుర్తుకు వస్తుందని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా జాతి వివక్ష, అణచివేతను తొలగించేందుకు ఉక్కు సంకల్పంతో అంబేద్కర్ ముందుకు సాగారని తెలిపారు. అంబేద్కర్ కేవలం దళితులకే కాదని, ఓబీసీలు, మహిళల కోసం, ముఖ్యంగా మానవ హక్కుల కోసం పనిచేసిన గొప్ప మనిషి అని కొనియాడారు. ఆ మహానుభావుడి వల్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. ఆ మహనీయుడి స్ఫూర్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలోనే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నగర నడిబొడ్డులో ప్రతిష్ఠించుకున్నామని, ఆ ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని చెప్పారు. ఏడాదిన్నర తర్వాత అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వం లైట్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడు గజ్జెల ఆనంద్, భారత జాగృతి నగర కోకన్వీనర్ తేజా చౌదరి, మాజీ కార్పొరేటర్లు మహేశ్ యాదవ్, లక్ష్మీనారాయణమ్మ, గణేశ్, రమేశ్, సత్యవతి, రేణుక, మేఘన, సోని, పూజ తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్‌లో అంబేద్కర్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో సూరజ్ మండల్

మిన్నంటిన జై భీమ్ నినాదాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం జై భీమ్ నినాదాలు మిన్నంటాయి. అంబేద్కర్‌కు నివాళులు అర్పించేందుకు ఎమ్మెల్సీ కవిత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రావతి, రాష్ట్ర కార్పొరేషన్‌ల మాజీ చైర్మన్‌లు నగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజీవ్‌సాగర్‌తోపాటు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వారిని విగ్రహం వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు జరిగాయి. పోలీసులను తోసుకుంటూ విగ్రహం వద్ద ఉన్న హాలులోకి వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు జై భీమ్ అంటూ పెద్దపెట్టున నినదించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై ఉన్న అక్కసుతోనే 125 అడుగుల భారీ విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అంబేద్కర్‌కు నివాళులు అర్పించకపోవడమంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమానించినట్టేనని పేర్కొన్నారు.

తొలి నుంచి అంబేద్కర్‌కు కాంగ్రెస్ అవమానం: రాజీవ్‌సాగర్

దేశంలో తొలినాళ్ల నుంచి ఇప్పటివరకు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అడుగడుగునా అవమానిస్తూ వస్తున్నదని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ ఆరోపించారు. అంబేద్కర్ ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న కాంగ్రెస్ సర్కారు.. ఆయన విధానాలను అమలు చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ అభయహస్తం కింద దళితులకు రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడికి దిగొచ్చే కాంగ్రెస్ సర్కారు మహా అంబేద్కర్ విగ్రహం గేట్లు తెరిచిందని తెలిపారు.

దళితుడి బట్టలూడదీసి నిర్బంధం

- మాజీ ఎమ్మెల్యే ఫొటో పెట్టారని దళిత నాయకుడి ఫ్లెక్సీ తొలగింపు
- దళిత సంఘాల ఆందోళన, అరెస్టులు
- మాజీ ఎంపీపీ ప్యాంటు ఊడినా ఆగకుండా లాక్కెళ్లిన పోలీసులు
- దళితులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే జాజాల రాస్తారోకో
- కామారెడ్డి జిల్లా లింగంపేటలో ఉద్రిక్తత

లింగంపేట, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి రోజునే పోలీసులు దళితుల పట్ల కర్కశంగా వ్యవహరించారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు నీరడి సంగమేశ్వర్ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేయించారు. ఫ్లెక్సీని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సీఐ రవీందర్ నాయక్ వచ్చి పంచాయతీ సిబ్బందిని పురమాయించి ఫ్లెక్సీని తీసేయించారు. ఇదేమిటని దళిత సంఘాల నాయకులు ప్రశ్నించగా, సీఐ వారితో దురుసుగా ప్రవర్తించారు. ఆయన తీరును నిరసిస్తూ నాయకులు రహదారిపై బైఠాయించారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పక్కకు లాగిపడేశారు. ఈ క్రమంలో దళిత మాజీ ఎంపీపీ సాయిలు ప్యాంటు ఊడిపోయినా పట్టించుకోకుండా కాళ్లుచేతులు పట్టుకుని లాక్కెళ్లారు. ఘటన సంగతి తెలిసి అక్కడికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జాజాల ఆందోళనకు దిగారు.

మాజీ ఎంపీపీ సాయిలు ప్యాంట్ ఊడిపోతున్నా లాక్కెళ్తున్న పోలీసులు

జనగామ జిల్లా దేవరుప్పులలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ తర్వాత మాట్లాడుతున్న ఎర్రబెల్లి

నిర్బంధం మధ్య అంబేద్కర్ విగ్రహావిష్కరణ

దేవరుప్పులలో పూలమాల వేసిన ఎర్రబెల్లి • ఎమ్మెల్యే ఒత్తిడి, పోలీసుల ఓవరాక్షన్

దేవరుప్పుల, ఏప్రిల్ 14: జనగామ జిల్లా దేవరుప్పులలోని ప్రధాన చౌ